క్లుప్తంగా

లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే



కోరుమిల్లిలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ పథకంలో లబ్ధిదారుల గుర్తింపు సర్వే మంగళవారం నిర్వహించారు. ఏపీ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (ఏపీడీడీసీఎఫ్) పర్యవేక్షణలో గ్రామ గ్రామాన ×జగనన్న పాలవెల్లువ– మహిళా డెయిరీ సహకార సంఘాన్ని (ఎండీఎస్ఎస్) ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆ ప్రక్రియలో భాగంగా సహకార సంఘాల ఏర్పాటు కోసం అర్హత గల మహిళా పాడి రైతులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, పశు సంవర్ధక శాఖ మండల అధికారి ఇందుప్రియ పర్యవేక్షణలో సర్వే సాగుతుంది. త్వరితగతిన సర్వే పూర్తి చేసి సంఘాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఎంపీడీఓ వివరించారు.

సర్వే రాళ్ల ఏర్పాటు పనులు



అంగరలో సర్వే రాళ్ల ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ జగనన్న భూరక్ష–2020 పథకంలో భాగంగా అంగరలో భూ సర్వే పూర్తయింది. దీంతో తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలో సర్వే రాళ్లు అమర్చే పనులను సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు మంగళవారం ప్రారంభించారు. తొలుత ప్రభుత్వ భూములైన కాలువ గట్లు, చెరువులకు సర్వే రాళ్లు పాతుతున్నామని, త్వరలో రైతు భూముల్లో రాళ్లు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



మట్లచెరువులో సిద్ధమైన సాయిబాబా పాలరాతి విగ్రహం

రామచంద్రపురం రూరల్: మండలంలోని మట్లచెరువులో షిరిడీ సాయి సేవాశ్రమం ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ప్రారంభించారు. మంగళవారం హోమ పూజలు, విగ్రహ మూర్తి ప్రతిష్ఠ, సత్సంగ ప్రసంగాలు నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆలయాన్ని సందర్శించి వెళ్లారు. కాగా నేటి ఉదయం 8.16 గంటలకు సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

'దొమ్మేటి' మృతికి సంతాపం

రామచంద్రపురం రూరల్: మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు మృతికి రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం తరఫున అధ్యక్ష, కార్యదర్శులు నరాల ఏడుకొండలు, పలివెల నాగరాజులు మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దొమ్మేటి అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించినందుకు సీఎం జగన్, మంత్రి చెల్లుబోయిన వేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోండి



నేలటూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

కపిలేశ్వరపురం: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు నిర్దేశించిన సమయంలోగా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని నేలటూరు తదితర గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను ఆయన సందర్శించారు. గ్రామ అధికారులతో కలసి ప్లాటు పొందిన లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన స్థలంలో త్వరితగతిన ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. నేలటూరులోని 4 జగనన్న నాలుగు లేఅవుట్లలో 150 మందికి పట్టాలిచ్చారు. ఇందులో 138 మందికి ఇంటి రుణం మంజూరైంది. 56 మంది ఇళ్ల నిర్మాణాలను ఇప్పటికే పూర్తి చేసుకోగా 71 మందికి చెందిన ఇళ్లు వివిధ దశల్లో ఉండగా 11 పనులను ప్రారంభించాల్సి ఉందని కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.

నవోదయానికి నాలుగేళ్లు..

- క్రమం తప్పకుండా సంక్షేమ క్యాలెండర్
- ప్రజల జీవన స్థితిగతులు మెరుగు
- సీఎం జగన్‌కు జై కొడుతున్న జనం



ప్రజల ఆదరాభిమానాలు పొందిన సంతోషంలో సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: సరిగ్గా నాలుగేళ్ల కిందట ఎప్పుడూ చూడని ఘనత చరిత్రకెక్కింది. రాష్ట్రంలో 153 అసెంబ్లీ సీట్లను ప్రజలు అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అధికారాన్ని అప్పగించారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రతిఒక్కరి హృదయాన్ని తాకిన జగన్ అధికారం చేపట్టి వారి గుండె చప్పుడై పాలన సాగిస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజల వద్దకు పాలన చేరువ చేసే లక్ష్యంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు పురుడు పోశారు. ఏపీ పాలన వైపు ఇతర రాష్ట్రాలు చూసేలా చేశారు. సీఎం జగన్ నాలుగేళ్ల పాలన ఎలా సాగిందంటే..

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

మండపేట నియోజకవర్గంలోని 43 గ్రామాల పరిధిలో 79,406 కుటుంబాలు.. 2,65,944 మంది జనాభా ఉన్నారు. రామచంద్రపురం మండలంలోని 77 గ్రామాల్లో 70,450 కుటుంబాలు.. 2,43,410 మంది ప్రజలున్నారు. వారంతా రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో ఏదొక రూపేనా లబ్ధి పొందుతున్నారు. నాలుగేళ్లకు ముందు పేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ లబ్ధిని పొందేందుకు మండల, జిల్లా కేంద్రాల చుట్టూ, జన్మభూమి కమిటీల చుట్టూ వ్యయ ప్రయాసలకు ఓర్చి తిరిగేవారు. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టాక దేశంలో ఎక్కడా లేని సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను రూపొందించారు. రెండు నియోజకవర్గాల్లో 155 సచివాలయాలను ఏర్పాటు చేశారు. 2,637 మంది వలంటీర్ల ద్వారా పేదలకు పథకాలను దరి చేర్చారు.

మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా..

రామచంద్రపురంలో 105, కె.గంగవరం 78, కాజులూరు 80, మండపేట 94, రాయవరం 70, కపిలేశ్వరపురంలో 78 కలిపి మొత్తం 505 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా కార్యక్రమాలను ప్రభుత్వం చేస్తుంది. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేతో గ్రామాల వాతావరణం ఆరోగ్యకరంగా మారింది. 2023 ఫిబ్రవరిలో ప్రభుత్వ పాఠశాలలూ, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు చేశారు. 2023 మార్చి 14న 1–19 వయసున్న పిల్లలు, కిశోర బాలికలకు నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రత్యేక వాహనంలో తల్లీ బిడ్డలకు వైద్య సేవలందిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఎస్‌డీజీ టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. రెండు వేల మంది జనాభాకు ఒక విలేజ్ క్లినిక్ కేంద్రంగా 2023 ఏప్రిల్ 6 నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానం పూర్తి స్థాయిలో ప్రారంభమైంది. అంతకు ముందు కొద్ది నెలల పాటు ట్రయల్‌రన్ సేవలందించగా విజయవంతమైంది. హెల్త్ క్లినిక్‌ల ద్వారా 62 రకాల వైద్య సేవలను ఉచితంగా అందించే ఏర్పాట్లను చేస్తుంది.

రైతే రారాజు...

రైతు సంక్షేమానికి రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పింది. సాగు ప్రక్రియలన్నింటినీ, వ్యవసాయ అనుబంధ సేవలన్నింటినీ ఆర్‌బీకేకు అనుసంధానం చేసింది. రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రైతు భరోసా పథకం ద్వారా 2019 నుంచి 2022 వరకూ సుమారు 30 వేల మంది రైతులకు రూ.155 కోట్ల సాయమందించారు. 2019 నుంచి 2022 వరకూ రూ.6.97 కోట్ల సున్నా వడ్డీ రుణాలిచ్చారు. 2020, 21లలో రూ.49.32 కోట్ల ఇన్‌పుట్ రాయితీ అందించారు. 2020, 21లలో రూ.164 కోట్ల పంటల బీమాను అందజేశారు.

ఉచితంగానే నాణ్యమైన విద్య

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు నూతన సాంకేతికతను వినియోగిస్తూ విద్యాబోధన సాగిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా విద్యా పరికరాలు, ట్యాబ్‌లను అందించారు. నాడు–నేడు పథకం మొదటి విడతలో రాయవరం మండలంలో 17 పాఠశాలలకు రూ.3.20 కోట్లు, కపిలేశ్వరపురం మండలంలోని 18 పాఠశాలలకు రూ.3.66 కోట్లు, మండపేట పట్టణం, రూరల్ మండలంలో 54 పాఠశాలకు రూ.6.46 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. రెండో విడత పనులు కొనసాగుతున్నాయి.

ఇక ముందూ ఇదే తరహాలో...

సంక్షేమ క్యాలెండర్ 2023 –24ను ప్రభుత్వ ఇటీవల విడుదల చేసింది. ఏప్రిల్‌లో వసతి దీవెన, రెండో ఏడాది వైఎస్సార్ ఈబీసీ నేస్తంలను ఇచ్చింది. మే నెలలో వలంటీర్లకు వందనం, ఉచిత పంటల బీమా, వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా, వైఎస్సార్ మత్స్యకార భరోసాలను అందజేసింది. జూన్‌లో వైఎస్సార్ రైతు భరోసా, సీఎం కిసాన్, జగనన్న విద్యా కానుక, అమ్మఒడి, వైఎస్సార్ లా నేస్తం, జూలైలో జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్ఈలకు ప్రోత్సాహకాలు... ఇలా 2024 మార్చి వరకూ సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసింది. వీటిని పక్కాగా అమలు చేయనుంది. దీంతో జగనన్న పాలనకు జనం జేజేలు కొడుతున్నారు.

ప్రతి కార్యకర్తా శాసనసభ్యుడే..

రామచంద్రపురం: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పారదర్శకంగా జరుగుతున్న సీఎం జగన్ పాలనలో ప్రతి కార్యకర్త శాసనసభ్యుడేనని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సీఎం జగన్ పాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా రామచంద్రపురం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల సమక్షంలో కేక్‌ను కట్ చేసి మంత్రి వేణు స్వీట్లు పంచారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి వేణు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నవరత్నాల పథకాల సొమ్మును ఎటువంటి దళారులు లేకుండా ప్రజలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని మంత్రి అన్నారు. కరోనా సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకూడదని సంక్షేమాన్ని ఆపకుండా ప్రజలను వివిధ పథకాల ద్వారా ఆదుకున్నారని మంత్రి అన్నారు. సంక్షేమంతో పాటు అన్ని రంగాల్లోనూ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వర్లు, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి

- రూ.13.50 కోట్ల మంజూరు
- కౌన్సిల్ సమావేశంలో మంత్రి వేణు
- 49 అంశాలకు ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పురపాలక పరిధిలో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిని అందించేందుకు రూ.13.50 కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ వెల్లడించారు. పురపాలక సంఘం కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన తొలుత సాధారణ సమావేశం అనంతరం అత్యవసర సమావేశం జరిగింది. మొదటి సమావేశంలో 37 అంశాలకు అత్యవసర సమావేశంలో 12 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరైన మంత్రి వేణు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాట ప్రకారం పట్టణంలో ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటి కుళాయిని అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. స్వచ్ఛ రామచంద్రపురం చేసేందుకు గార్బేజ్ ఫ్రీ (చెత్తలేని) పట్టణంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. డ్రైనేజీ వాటర్ నుంచి మంచినీటిగా మార్చే ఎస్‌టీపీ ప్రాజెక్టుకు రూ.3.5 కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే రామచంద్రపురం పరిసర ప్రాంతంలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎంతో కాలంగా వృథాగా ఉన్న పట్టణంలోని పాత డంపింగ్ యార్డు ప్రదేశంలో నూతన రైతు బజార్ నిర్మాణం జరుగుతుందని దీని ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుందన్నారు. దీనికి ప్రణాళికలు వేసిన మున్సిపాలిటీ అధికారులను మంత్రి వేణు అభినందించారు. రైతు బజార్‌తో పాటుగా మున్సిపాలిటీ సాధారణ నిధులతో మరో 28 షాపులను కూడా నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కౌన్సిల్ సమయంలో ఇంత అభివృద్ధి జరగటం కౌన్సిలర్లు ఆనందించదగ్గ విషయమని మంత్రి పేర్కొన్నారు. తొలుత మొదటి అజెండాలోని 37 అంశాలను సీనియర్ అసిస్టెంట్ కె.వేణుగోపాలరావు సభ్యులను చదివి వినిపించారు. అనంతరం రెండో సమావేశంలోని 12 అంశాలను కూడా ఆయన సభ్యులను వినిపించారు. వాటిని ఆమోదిస్తున్నట్లు చైర్ పర్సన్ శ్రీదేవి ప్రకటించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు, కమిషనర్ టి.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో ప్రజారంజక పాలన



మండపేటలో జరిగిన వేడుకలో పట్టాభి రామయ్య చౌదరి, రాజుబాబు, వెంకన్నబాబు

మండపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ సాగిస్తున్న పాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాలతో మండపేటలో వేడుకలు నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ జగ్గంపేట పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రాష్ట్ర నేతలు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. భారీ ఎత్తున బైక్ ర్యాలీగా రాజారత్న సెంటర్‌కు చేరుకుని దివంగత వైఎస్సార్ విగ్రహానికి పట్టాభిరామయ్య చౌదరి, రాజుబాబు, వెంకన్నబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాలతో పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నికల వాగ్దానాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నవరత్నాలతో పాటు మ్యానిఫెస్టోలో లేని ఎన్నో వాగ్దానాలను అమలు చేశారన్నారు. 2014 ఎన్నికల్లో 500లకు పైగా హామీలిచ్చిన చంద్రబాబు గద్దెనెక్కాక వాటిని గాలికొదిలేశారన్నారు. తిరిగి ఇప్పుడు చంద్రబాబు ఇస్తున్న వాగ్దానాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వారన్నారు. జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి భవాని, పుట్టపూడి అబ్బు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు జిన్నూరి సాయిబాబా, గారపాటి అశోక్‌కుమార్, ముక్కా సుబ్రహ్మణ్యం, సయ్యద్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల రీసర్వే పూర్తి చేయాలి



జగన్నాథగిరిలో సిబ్బందికి సూచనలిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా

కాజులూరు: జగనన్న శాశ్వత భూ హక్కు రక్ష రీ సర్వే కార్యక్రమం రెవెన్యూ సిబ్బంది అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. కాజులూరు మండల గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది భూ సర్వే నిర్వహించి ప్రస్తుతం ప్రభుత్వ స్థలాల సరిహద్దుల్లో మక్కురాలు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం మండలంలోని జగన్నాథగిరిలో జరుగుతున్న మక్కురాళ్ల ఏర్పాటును ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్డీఓ బీవీ రమణ తదితరులు సందర్శించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ, ఏఓ వి.అశోక్, ఆర్ఐ వేగేశ్వరరావు, వీఆర్వోలు, ఈశ్వరరావు, గోపాలరావు, వీఆర్ఏలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం



తహసీల్దార్ కార్యాలయ నూతన భవనం వద్ద ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయ భవనం నేటి ఉదయం 8.16 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ పి.తేజేశ్వరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్, వీఆర్ఓలు ఏర్పాట్లలో తలమునకలయ్యారు.

ప్రతిష్ఠాత్మకంగా విద్యాకానుక కిట్ల పంపిణీ



రాయవరం జేవీకే స్టాక్ పాయింట్‌లో యూనిఫాం నాణ్యత చెక్ చేస్తున్న సమగ్ర శిక్షా అధికారులు

రాయవరం: వచ్చే విద్యా సంవత్సరంలో జగనన్న విద్యా కానుక–4 పంపిణీని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని సమగ్రశిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్ బాబు తెలిపారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక పంపిణీలో ప్రతి దశలో నాణ్యతను పరిశీలించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జేవీకే–4లో పంపిణీ చేసే యూనిఫామ్, షూ, స్కూల్ బ్యాగ్స్, బెల్టు తదితర వస్తువులను స్టాక్ పాయింట్ వద్ద మోడల్ కిట్‌ను ప్రదర్శిస్తున్నామన్నారు. క్వాలిటీ చెకింగ్ టీమ్ తనిఖీ అనంతరం మాత్రమే స్టాక్‌ను దిగుమతి చేస్తున్నామన్నారు. ఎంఈఓ వై.సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు స్కూల్ బ్యాగ్స్, నోట్‌బుక్స్ మినహా మిగిలిన అన్ని వస్తువులు స్టాక్ పాయింట్‌కు చేరుకున్నాయన్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థి చేతిలో జగనన్న విద్యా కానుక కిట్‌ను ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల చేరికలపై సమీక్ష చేశారు. తనిఖీల్లో సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్.రామారావు, సీఆర్పీలు కిలపర్తి పోసిరాములు, వాసంశెట్టి సీతాధనలక్ష్మి, కుంచే నీనాసిరి, పార్ట్‌టైమ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతు బజార్‌కు మోక్షం

- రూ.కోటితో నిర్మాణం
- మున్సిపల్ సాధారణ నిధుల నుంచి మరో 28 షాపులు
- తీరనున్న పట్టణ వాసుల కష్టాలు



రైతు బజార్ నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చి అధికారులతో చర్చిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న రైతు బజార్ కల నేటికి నెరవేరనుంది. రామచంద్రపురం పట్టణంతో పాటుగా పరిసర ప్రాంతాల ప్రజలకు, రైతులకు మేలు చేకూరుస్తూ రైతు బజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయగా రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రైతు బజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పురపాలక పరిధిలో సుమారుగా 50 వేల మంది జనాభా ఉండగా 17 వేల కుటుంబాల వారున్నారు. వీరితో పాటుగా నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాలకు చెందిన వారు, పక్కన ఉన్న మండపేట నియోజకవర్గంలోని రాయవరం మండలం పసలపూడి, వెంటూరు, చెల్లూరు, నదురుబాద, మాచవరం, సోమేశ్వరం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలకు కూడా రామచంద్రపురం మార్కెట్‌కు వస్తుంటారు. నియోజకవర్గంలోని ద్రాక్షారామతో పాటుగా పట్టణంలోను కూరగాయల కొనుగోళ్లకు వస్తుంటారు. అయితే ఎక్కడా లేని విధంగా పట్టణంలో కూరగాయలు అధిక ధరలు ఉండేవి. దీంతో దివంగత సీఎం వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద మున్సిపాలిటీ స్థలంలో రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. కానీ కాలక్రమేణా కూరగాయల దుకాణదారులు సిండికేట్‌గా ఏర్పడి రైతు బజార్‌ను నిర్వీర్యం చేశారు. గతంలో రైతు బజార్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరినా టీడీపీ హయాంలో అది నెరవేరలేదు.

రూ.కోటితో రైతుబజార్ నిర్మాణం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకష్ణ చొరవతో పట్టణంలో తిరిగి రైతు బజార్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోను రైతు బజార్‌లు ఏర్పాటు చేస్తుండగా అందులో భాగంగా రామచంద్రపురానికి రైతు బజార్‌ను మంజూరు చేసి రూ.కోటి నిధులను విడుదల చేస్తూ గతంలోనే జీవోను జారీ చేశారు. ఈ మేరకు టెండర్లు పిలిచి పనులను ప్రారంభించారు. ప్రభుత్వం రైతు బజార్‌ను మంజూరు చేయటంతో మున్సిపాలిటీలో స్థలాన్ని కేటాయించారు. గతంలో మాదిరిగా కాకుండా పెద్ద మార్కెట్‌కు దగ్గరలోనే వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి వేణు అధికారులను ఆదేశించారు. దీంతో 23వ వార్డులోని శివాలయం రోడ్డు నుంచి వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్లే రోడ్డుకు ఉత్తరం వైపున పురపాలక సంఘానికి చెందిన 1.48 ఎకరాల స్థలంలో 25 సెంట్ల స్థలాన్ని రైతు బజార్‌కు కేటాయిస్తు 2021 జూలై 26న జరిగిన మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేస్తూ కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఈ స్థలాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ వారికి కేటాయించారు. దీంతో ప్రస్తుతం టెండర్లు పూర్తి కావటంతో రైతు బజార్ నిర్మాణానికి మార్కింగ్‌లను చేయించారు.


తీరనున్న కష్టాలు



రైతు బజార్‌ను ఏర్పాటు చేయడం వల్ల పట్టణంతో పాటుగా పరిసర ప్రాంతాల ప్రజలు సుమారుగా 2 లక్షల మందికి ఉపయోగం కాగా 20 వేల మంది రైతులకు డైరెక్టుగా రైతు బజార్‌లో తమ కూరగాయలను అమ్ముకునే వీలుంటుంది. రైతులు దళారుల బారిన పడకుండా తమకు నచ్చిన ధరకు అమ్ముకునే వీలుండగా వినియోగదారులకు తక్కువ ధరకు కూరగాయలు లభించనున్నాయి.

– గాదంశెట్టి శ్రీదేవి మున్సిపల్ చైర్ పర్సన్

ప్రజలకు చేరువలో..



గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో పట్టణంలో ప్రజలు పడుతున్న కష్టాలను గమనించాం. రోడ్డు పక్కన, ఇతర ప్రాంతాల్లో కూరగాయలు అమ్ముకునే వారు దుకాణాలు వేస్తుండే వారు. వీరి కష్టాలను తొలగించి ప్రజలకు అత్యంత చేరువలో రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని అప్పట్లోనే నిర్ణయం తీసుకున్నాం. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో గుర్తించి సమస్యల పరిష్కారంలో భాగంగానే ఇప్పుడు రైతు బజార్ నిర్మాణం చేస్తున్నాం.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర మంత్రి

బీసీల అభివృద్ధికి పెద్దపీట



సోమేశ్వరంలో సామాజిక భవనం పనులకు పూజ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీలు

రాయవరం: బీసీల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ తెలిపారు. సోమేశ్వరంలో సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో అసంపూర్తిగా ఉన్న శెట్టిబలిజ సామాజిక భవన నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి జరుగుతుందన్నారు. బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలను వాడుకుని వదిలేశారే తప్ప, రాజకీయ ప్రాధాన్యం కల్పించలేదన్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, బీసీలను మోసగించే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారన్నారు. తొలుత రూ.5 లక్షల జెడ్పీ నిధులతో సామాజిక భవన నిర్మాణ పనులకు ప్రారంభ పూజలు చేశారు. ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, శెట్టిబలిజ సంఘం పెద్దలు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.